విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 17, మార్చి 2023

పంచాయతీల అభివృద్ధికి తోడ్పడండి

విశాలాంధ్ర-చిలమత్తూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఈ ఓ ఆర్ డి, సుహాసనమ్మ అధ్వర్యంలో డి ఎల్ పి ఓ బాలాజీ హాజరై, పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలని కార్యదర్శులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో ఇంటి పన్ను, కొళాయి పన్నులు, వసూలు చేయాలని, గ్రామాల్లో ప్రతి ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించాలని, స్వచ్ఛ సంకల్పంలో భాగంగా కంపోస్ట్ ఎరువులు తయారుచేసి సరసమైన ధరలకే రైతులకు అందించాలన్నారు. ఈ తతంగం అంతా వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, గంగ రత్నమ్మ, నాగరాజు, రామ్లా నాయక్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలకు పాల్పడొద్దు

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, ఇంట్లో అమ్మ నాన్న తిట్టారని, పరీక్షలు బాగా రాయలేదని, ప్రేమ విఫలయం అయిందని, ఇలా రకరకాల కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడకూడదని స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అనంతపురం జిల్లా

వైస్ ప్రెసిడెంట్ కావలి ఈశ్వర్ పేర్కొన్నారు. గురువారం మండలంలో మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల హైస్కూల్ నందు అవగాహన కార్యర్రక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఏఏ సమస్య వచ్చినా ముందుగా పాలు పంచుకోవాల్సింది తల్లిదండ్రుల దగ్గరఅని, అది ఏ విషయమైనా సరే మీకు సమాధానం తల్లి దగ్గర దొరుకుతుందన్నారు. మీరు ఆత్మహత్య చేసుకున్న తర్వాత ఆ తల్లిదండ్రులు పడే బాధ అంత ఇంత కాదని, ఈ జన్మకు వారు మిమ్మల్ని మర్చిపోలేరన్నారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరగకుండా పిల్లలందరినీ మోటివేషన్ చేయడానికి ఈ ప్రోగ్రాం ఏర్పాటు చేయడమైందన్నారు. మీకు ఏమి ఇబ్బంది కలిగిన ముందుగా చెప్పుకోవాల్సిన తల్లిదండ్రులకు పిల్లలందరికీ చెప్పడమేనన్నారు. స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ తరపున మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల హైస్కూల్ నందు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామినేషన్ మరియు పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో మహాత్మ జ్యోతిరావు పూలే ప్రిన్సిపల్ నారాయణ స్వామి, మరియు డి. హిరేహాళ్ మండలం మడేనల్లి హై స్కూల్ హెడ్మాస్టర్ రజియా బేగం, హై స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు గురువారం ప్రిన్సిపాల్ అశ్రఫ్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలుగు జాతి

కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని మద్రాస్ రాష్ట్రం నుండి విడిపోయి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడడానికి తన ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కృషి చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. నేటి యువత పొట్టి శ్రీరాములు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడలలో పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది సురేష్ బాబు,వెంకటేష్ నాయక్,సులోచన,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి నిధులు కేటాయించండి

విశాలాంధ్ర-కూడేరు: మండల పరిధిలోని కొర్రకోడులో రెండవ పీ.హెచ్ సి.గా. ప్రభుత్వం గుర్తించి రెండు సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు నిధులు కేటాయించలేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు రమణ, సిపిఐ మండల కార్యదర్శి నారాయణమ్మ లు అన్నారు. గురువారం వారు కూడేరులో విలేకరులతో మాట్లాడుతూ కొర్ర కోడులో సర్వేనెంబర్ 324లో రెండు ఎకరాల భూమిని ప్రభుత్వము గుర్తించిందన్నారు. దీంతో అధికారులు వచ్చి స్థల పరిశీలన చేసి వెళ్లారన్నారు. అయితే ఇంతవరకు కూడా అక్కడ పునాది కూడా పడలేదని అన్నారు. ప్రభుత్వం గుర్తించి ఈ బడ్జెట్ లో అయినా నిధులు కేటాయించి త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని వారు కోరారు. ఆస్పత్రి పూర్తి అయితే దాదాపు 7 సెక్టార్ గ్రామాల్లో వారు ఇక్కడ వైద్యం పొందడానికి వీలుంటుంది అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో దూరప్రాంతాలకు వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.

గడ్డివామి దగ్ధం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని వన్నల్లి గ్రామంలో వన్న రెడ్డి, నరసింహులకు చెందిన రెండు గడ్డివాములు ప్రమాదవశాత్తు గురువారం దగ్ధమై రూ.70,000 వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నారు. వన్నా రెడ్డికి చెందిన 8 ఎకరాల జొన్న సొప్ప వరిగడ్డి, నరసింహులు కు చెందిన వేదిశనగపొట్టు వరిగడ్డి రెండు వాములు ప్రమాదవశాత్తు నిప్పు పడడంతో గ్రామస్తులు చూసి ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. వెంటనే అగ్నిమాపక వాహనం కు ఫోన్ చేసి తెలపడంతో అది వచ్చేలోపు గడ్డివాము లు దగ్ధమైంది. మిగతావాములకు మంటలు రాకుండా అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆపారు. సుమారు రూ.70,000 వరకు అస్తి నష్టమాటిలినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి వీఆర్వో రామన్న వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. గడ్డివాములు దగ్ధం అయినా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు పోయారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-కనేకల్లు: మేజర్ పంచాయతీలోని రామ నగర్ లో గురువారం

పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని పిఏసిఎస్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్ప చౌదరి ప్రారంభించారు. రామనగర్ లోని పిఏసిఎస్ గోదాము వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో సొసైటీ అధ్యక్షులు తిమ్మప్ప చౌదరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పప్పు సెనగ రైతులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి క్వింటాలు శనగ విత్తనాలు కనీస మద్దతు ధర రూ.5,335లతో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. బహిరంగ మార్కెట్లో గిట్టుబాటు ధర లభించడం లేదని శనగ రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. బహిరంగ మార్కెట్ కంటే ఎక్కువ దరకు ప్రభుత్వం శనగ విత్తనాలను కొనుగోలు చేస్తుందన్నారు. పండించిన పంటను తక్కువ ధరకు దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో పంట ఉత్పత్తులను విక్రయించుకోవాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో కనేకల్ పిఏసిఎస్ సీఈవో హనుమంతు, ఎంపీఈఓ లాలుస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత హత్య

విశాలాంధ్ర - హిందూపురం : సత్యసాయి జిల్లా హిందూపురం రూరల్ పరిధిలోని కొటిపి పంచాయతీ బసవేశ్వర కాలనీలో బుధవారం రాత్రి హత్య జరిగింది. రూరల్ సిఐ ఎం కృష్ణారెడ్డి వివరాల మేరకు, సరస్వతి గత పది సంవత్సరాల నుండి కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరు కు చెందిన అజీమ్ అను వ్యక్తి సహజీవనము చేస్తున్నాడని, ఇరువురు బుధవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో డబ్బులు విషయంలో గొడవ పడగా, సదరు అజీమ్ సరస్వతిని ఎదలపై కొట్టి గొంతు పిసికి హత్య చేసినా దన్నారు. గురువారం సరస్వతి తల్లి సావిత్రి పిర్యాదు మేరకు,అజీం పై హత్యకేసు నమోదు చేశామని రూరల్ సిఐ ఎం కృష్ణారెడ్డి తెలిపారు.

లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: ఆంధ్రప్రదేశ్ అల్లోపతి మెడికల్ కౌన్సిల్ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత కమిటీ చట్టం క్రింద ఉన్న పట్టణ ప్రైవేట్ ఆసుపత్రులు అలాగే ఆరోగ్యశ్రీ సేవలను అందిస్తున్న ఆసుపత్రుల వారికి గురువారం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం నకు అధ్యక్షత వహించిన అధికారులు మాట్లాడుతూ ఆసుపత్రుల యాజమాన్యం వారికి వివరాలు పొందుపరచడంలో తగు సూచనలు చేస్తూ, ప్రైవేట్ ఆస్పత్రుల వారు అందిస్తున్న సేవలను ప్రతి రోజూ జిల్లా కార్యాలయానికి త్వరితగతిన వివరాలను తెలపాలన్నారు. అలాగే గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం లో భాగంగా ఆసుపత్రుల వారు పొందుపరిచే ఫారం -ఎఫ్ ను సవివరంగా జిల్లా కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు. అదే విధంగా ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్ అప్లికేషన్ గురించి ఐ ఆర్ ఏ డి ప్రాజెక్ట్ మేనేజర్ సొమ్లా నాయక్ మరియు జిల్లా రవాణా వైద్యాధికారి డా. సురేష్ లు మాట్లాడుతూ...రోడ్డు ప్రమాద బాధితులు చికిత్స నిమిత్తం ఆసుపత్రి నందు చేరినప్పుడు వారి వివరాలను ఎప్పటికప్పుడు ఐ ఆర్ ఏ డి అప్లికేషన్ లో ఖచ్చితంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డెమో భారతీ,డిప్యూటీ డెమో త్యాగరాజు, మారుతి ప్రసాద్, గిరిధర్ రెడ్డి, వేణు,శ్రీకాంత్,కిరణ్, పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారము సిఐటియు పట్టణ అధ్యక్షులు డి. రామాంజనేయులు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య, పర్మనెంట్ అవుట్సోర్సింగ్ కార్మికుల సమస్యలపై ఈనెల 17వ తేదీన జిల్లా వ్యాప్తంగా కార్మికులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని తమకు అనుమతి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియాకు

వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం. ఉద్యోగాల పెర్మనెంట్, సంక్షేమ పథకాల అమలు ఇంజనీరింగ్ కార్మికుల హెల్త్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు 18వేల 500 రూపాయలు వేతనం, పర్మినెంట్ కార్మికులకు జిపిఎఫ్ అకౌంట్లు, హెల్త్ కార్డులు ప్రమోషన్స్ తదితర డిమాండ్లకై ప్రతి మున్సిపల్ కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు రాంప్రసాద్, శ్రీను, జివి ప్రసాద్, ఎం. వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

టీచర్ ఎమ్మెల్సీ విజేత పట్ల ఉత్కంఠ

విశాలాంధ్ర-రాప్తాడు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 13వ తారీఖున జరిగాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల కు సంబంధించి 2,45,575, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 25,879 ఓట్లు పోలయ్యాయి. ఇందులో భాగంగా మూడు జిల్లాల బ్యాలెట్ పేపర్ల బాక్సులను అనంతపురం జేఎన్టీయూకు తరలించారు. ఈ సందర్భంగా నగరంలోని జెఎన్టీయు కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు ఐఏఎస్ పోలా ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు ఎం.హరిజవహర్ లాల్, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి కలిసి అభ్యర్థుల సమక్షంలో గురువారం ఉదయం 8 గంటలకు ఉపాధ్యాయ ఎన్నికల స్ట్రాంగ్ రూమ్ ఓపెన్ చేసి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు తరలించారు. కాగా పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఉత్కంఠగా మారింది. ఇప్పటివరకు తొలి ప్రాధాన్యతకు సంబంధించి మొదటి రౌండ్ ఫలితాలు వెల్లడయ్యాయి. మొత్తం 25, 887ఓట్లు పోలవగా తొలి రౌండులో 13997 ఓట్లు లెక్కించారు ఇందులో 323 ఓట్లు చెల్లనివిగా ఉన్నాయి. మిగిలిన 11890 ఓట్లను రెండో రౌండ్ ప్రాధాన్యతగా లెక్కిస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు మొత్తం పోలైన ఓట్లు కాకుండా చెల్లిన ఓట్లలో 50% కంటే ఒక ఓటు ఎక్కువగా రావాల్సి ఉంటుంది. అంటే ఏ అభ్యర్థి విజయం సాధించాలన్నా సుమారు 12 వేల ఓట్లకు పైగా రావాలి. తొలి రౌండులో వైసీపీ బలపరిచిన ఎం.వి. రామచంద్రారెడ్డికి 4756 ఓట్లు వచ్చాయి. అంటే రెండో రౌండ్లో లెక్కిస్తున్న ఓట్లలో ఈయనకు 8000 ఓట్ల వరకు రావాల్సి ఉంటుంది. రెండో రౌండ్లో లెక్కిస్తున్న ఓట్లు 11,890 ఇందులో చెల్లని ఓట్లు కూడా ఉంటాయి. అయితే ఒకే అభ్యర్థికే 8000 ఓట్లు రావడం కొద్దిగా కష్టమేనని తెలుస్తోంది. రెండో స్థానంలో ఉన్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి 3543 ఓట్లు రాగా, మూడో స్థానంలో ఉన్న కత్తి నరసింహారెడ్డికి 2500 ఓట్లతో నాలుగో స్థానంలో డాక్టర్ చామల అనిల్ వెంకటప్రసాదరెడ్డికి 1726ఓట్లు వచ్చాయి.

రెండవ రౌండ్లో ఆధిక్యం

రెండవ రౌండ్లో కూడా వైసిపి మద్దతు దారుడు రామచంద్ర రెడ్డి ఆధిక్యం

సాధించారు. ఈయన మొదటి రౌండు ఓట్లతో కలిపితే మొత్తం 8846 వచ్చాయి. ఒంటేరు శ్రీనివాసుల రెడ్డికి రెండు రౌండ్లలో 6853 ఓట్లు వచ్చాయి. పిడిఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి రెండు రౌండ్లు కలిపి 4162 ఓట్లు వచ్చాయి. ఎమ్మెల్సీగా గెలుపొందాలంటే మొత్తం 12940 ఓట్లు సాధించాలి. అయితే అధిక్యంలో ఉన్న ఎంవీ రామచంద్రారెడ్డి 4093 ఓట్ల దూరంలో ఉన్నారు. రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి వచ్చాయన్న దానిపై తీవ్ర ఉత్కంతత నెలకొంది. .

కొనసాగుతోన్న కౌంటింగ్

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో వైసిపి బలపరిచిన అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి మొదటి, రెండో రౌండ్లో నూ ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఇక రెండో స్థానంలో రెండో రౌండ్లో కూడా ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కొనసాగుతున్నారు. ఇక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియను బట్టి పరిశీలిస్తే వైసిపి టిడిపి అభ్యర్థులు హెూరాహెూరీగా పోరాడుతున్నారు. స్పష్టమైన ఫలితాలు రావడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉంది. కార్యక్రమంలో జేసీ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ డీఆర్ఓ గాయత్రీ దేవి పాల్గొన్నారు.

పచ్చని చెట్లు బూడిదవుతున్నాయి

విశాలాంధ్రబ్యూరో అనంతపురం: ఒకవైపు పర్యావరణం కాలుష్యభరితమవుతుంటే, మరోవైపు కలుషితాలను కడిగివేసే అడవులు, వృక్ష సంపద అంతకంతకూహరించుకుపోతున్నాయి. మరోవైపు రోడ్డు మధ్యలో ట్రాఫిక్ ఐలాండ్, రహదారులు ఇరువైపుల ఎక్కడపడితే అక్కడ నిప్పంటుకుని పచ్చని చెట్లు కాలి బూడిదవుతున్నాయి. ఇదే అదనుగా ఆకతాయిలు ఎండుగడ్డికి నిప్పు పెట్టడంతో అడ్డు అదుపు లేకుండా చాల చెట్లు, తోటలు కాలిపోతున్నాయి. ఫారెస్ట్ బీట్ ఆఫిసర్లు రెవెన్యూ సిబ్బంది జిల్లా యంత్రాంగం కేవలం ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు తప్ప నష్టాన్ని నివారించలేక పోతున్నారు. పర్యావరణంలో వాయు కాలుష్యాన్ని తగ్గించి ప్రాణవాయువు అందించేందుకు వృక్ష జాతికి మించిన ఉత్తమ మార్గం మరొకటిలేదు. భూమిపై కనీసం నాలుగవ వంతు అడవులు వుండాలని పర్యావరణవేత్తలు చెబుతున్నా పెడచెవిన పెట్టి నిత్యం పచ్చిక బయళ్ళు, కొండకు నిప్పు పెట్టి మనుషులు తమ రాక్షస ప్రవృత్తిని చాటుతున్నారు. రెండు రోజుల క్రిందట ఆకతాయిలు పెట్టిన కార్చిచ్చు కు కదిరి ప్రాంతంలో నిఅడవులు అగ్నికి ఆహుతి అయ్యాయి.ఆత్మకూరు లో సుమారు పది ఎకరాలు బుగ్గిపాలైనది, గుత్తి, పామిడి మండలంలో కొంతమేరకు బుగ్గిపాలయ్యింది. చాల మూగ జీవాలు వేల కొద్దీ చెట్లు కాలి బూడిదయ్యాయి. ప్రతి నిత్యం ఉమ్మడి అనంతపురం జిల్లాలో రహదారి మధ్యన జాతీయ రహదారి లో మంటలు చెలరేగుతున్నా, పచ్చని చెట్లు కాలి బూడిదవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. కొండలు, గుట్టలు బొగ్గుల కోసం బుగ్గిపాలవుతున్న ఆపే అధికారులు లేరు. ప్రజలకు పర్యావరణ ప్రాముఖ్యత వివరించాల్సిన అధికారులు, పౌర సంఘాలు, ఎన్జీఓ లు ఆ వైపుగా కృషి చేయటంలేదు. మార్చి నెల మొదటి వారంలోనే 35-36 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండడం దీనికి తోడు చెత్తకు నిప్పు పెట్టే క్రమంలో రోడ్లు పచ్చని చెట్లు అగ్నికి ఆహుతవుతున్న పట్టించుకునే వారు కరువయ్యారు. గత మూడు రోజులుగా తొండపాడు, జక్కలచెరువు, బందార్లపల్లి, మల్లేనిపల్లె కొండలకు నిప్పు పెట్టారు. పర్యావరణ కాలుష్యన్ని నివారించాలి. మనం చేసే పనుల వలన అన్నీ అనర్థాలు జరుగుతున్నాయి. దాన్ని నివారంచటం మన చేతుల్లోనే ఉంది. మనం వాడే పరికరాల వలనే ఇదంతా జరుగుతోంది. ఇంధనం వాడకాన్ని తగ్గించాలి. కాలుష్యాన్ని కలిగించే వస్తువుల వాడకం తగ్గించాలి. ముఖ్యంగా ప్లాస్టిక్స్ వాడకాన్ని తగ్గించాలి. ఫారెస్ట్ బీట్ నిర్వహించాలి, నేషనల్ హై వే అథారిటీ, రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖ సమన్వయంతో జిల్లా, మండల మరియు పంచాయితీ స్థాయిలో పర్యావరణ ప్రాముఖ్యత గురించి ప్రజలను భాగస్వాములను చేసి నష్టాన్ని నివారించాలి. లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, సైన్స్ ప్రచార వేదికలు స్వచ్ఛంధ సంస్థలు ప్రజలను చైతన్యపరచాలి.

బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యత

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో గురువారం ప్రవేశపెట్టిన 2023-2024 వార్షిక బడ్జెట్ లో విద్యకు మంచి ప్రాధాన్యత కల్పించారని వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి యం.జిలాన్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో జిలాన్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాద్ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో విద్యకు మంచి ప్రాధాన్యతను కల్పిస్తూ జగనన్న విద్యా దీవెన కు రూ. 2.841.64 కోట్లు. జగనన్న వసతి దీవెన కు రూ. 2200 కోట్లు. జగన్ అన్న విద్యా కానుక కు రూ. 650 కోట్లు. అమ్మ ఒడి పథకానికి 6500 కోట్లు, శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలల రూపురేఖలు మార్చడానికి మన బడి నాడు-నేడు కు రూ.3500 కోట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టి విద్య వ్యవస్థ కు మంచి ప్రాధాన్యత కల్పించినందు ముఖ్యమంత్రి జగన్ ర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాద్ కు యం.జిలాన్ కృతజ్ఞతలు తెలిపారు.

పన్నుల వసూళ్ల శాతాన్ని పెంచండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: సత్య సాయి జిల్లాలో పంచాయతీల్లో పేరుకుపోయిన ఇంటి పన్నుల బకాయిలు వసూళ్ల శాతాన్ని పంచాయతీల కార్యదర్శి పెంచాలని డిపిఓ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం తలమర్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ రికార్డులను పరిశీలించారు. పంచాయతీలో పేరుకుపోయిన బకాయిలను ఈనెల 31వ తేదీ లోపల చేయాలని సూచించారు. 2023-24 సంవత్సరానికి గాను ఐదు కోట్లు వసూలు చేయాల్సి ఉండగా నాలుగు కోట్లు మాత్రమే వసూలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరత్న, కార్యదర్శి రామ్ గోపాల్ రెడ్డి మరియు సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలు ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగం

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: టీకాలు అనేవి చిన్నపిల్లలకు ఆరోగ్యానికి పెరుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని స్పందన హాస్పిటల్ డాక్టర్ తేజ కేతిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం జాతీయ టీకా దినోత్సవ సందర్భంగా పలు విషయాలను ప్రజలకు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పుట్టిన శిశువు నుండి ఐదు సంవత్సరాల వరకు విధిగా టీకాలు వేయించితే ఆరోగ్య జీవితం లభిస్తుందన్నారు. టీకా విషయంలో తల్లిదండ్రులు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. భారతదేశ ప్రజారోగ్య చరిత్రలో అత్యంత ప్రధానమైన మైలురాయికి గుర్తుగా ప్రతిఏటా 16వ తేదీన జాతీయ వాక్సినేషన్ దేను నిర్వహించడం జరుగుతుందన్నారు. టీకాలకు భయపడే వారితోపాటు టీకాలను వ్యతిరేకించే వారిని కూడా టీకా పరిధిలోకి తీసుకొని రావడానికి తీవ్ర ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని వారు తెలిపారు. పలు ప్రమాదకర వ్యాధులను జీవితకాలం నిరోధించడానికి, ప్రజారోగ్య పరిరక్షణకు, ఆరోగ్య నియంత్రణకు, ప్రాణాలు కాపాడటానికి టీకాలే దివ్య ఔషధమని వారు తెలిపారు. టీకాలతో ఆరోగ్య ,ఆర్థిక ,సామాజిక ప్రయోజనాలు కూడా కలుగుతాయని తెలిపారు. వ్యాధులు సోకకుండా భారతీయుల ఆరోగ్య కవచంగా నవజాత శిశువు నుంచి వయోవృద్ధుల వరకు టీకాలు పలు రోగాల నుంచి రక్షించడం, వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడం, జీవితకాలం వ్యాధులు శోకకుండా కట్టడి చేయగలమని వారు తెలిపారు. మన పిల్లలకు సకాలంలో అర్హత గల టీకాలను అందించాల్సిన కనీస కర్తవ్యం, తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలు మీద ఎంతైనా ఉందని వారు తెలిపారు.

ముందస్తు టీకా...వ్యాధి నివారణకు తోడ్పాటు

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు : పాడి పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండ ముందస్తుగా వేస్తున్న టీకాలు వ్యాధి నివారణ తోడ్పటుగా పనిచేస్తాయని, ముందస్తు టీకాలు వేయడం పశువులకు ఎంతో శ్రేయస్కరమని పశువైద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలోని ఆకుతోటపల్లి, గాజుకుంటపల్లి

గ్రామాల్లో గురువారం పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో టీకా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి ప్రవీణ్ కుమార్ పాడి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ... పాడి పశువుల కాళ్లు, మూతి పై ఏవైనా చిన్న చిన్న కురుపులు ఇతర వ్యత్యాసాలు ఏవైనా గుర్తిస్తే రైతులు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గాలికుంటు వ్యాధి లక్షణాలు తదితర అంశాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పవన్, జోత్స్న, గోపాల్ మిత్ర మూర్తి పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 17, మార్చి 2023

ఇది ముమ్మాటికీ కాకి లెక్కల బడ్జెట్

విశాలాంధ్ర-పుట్టపర్తి: వైసీపి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఇది ముమ్మాటికి కాకి లెక్కల బడ్జెట్ అనిమాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూపేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా కేటాయింపులు జరిపారన్నారు.అసెంబ్లీలో ప్రవేశ పెట్టే బడ్జెట్ లో పావలా వంతు ఖర్చు పెట్టరు కానీ అంకెలతో గారడీ మాత్రం చేస్తుంటారని అన్నారు.ముఖ్యంగా వ్యవసాయ రంగానికి తీవ్ర అన్యాయం చేశారని, ఇక సాగు నీటి ప్రాజెక్టులు కేటాయింపులు దారుణం అని, టిడిపి హయాంలో 90 శాతం పూర్తయిన ప్రాజెక్టులుకు మిగిలిన పది శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోతున్నారు అని అన్నారు.నిరుద్యోగ యువతకు మొండి చేయి చూపించారని, ఇక గ్రామీణాభివృద్ధి అయితే దారుణంగా కుంటు పడిపోయిందని అన్నారు. వైసీపికి నిజంగానే ఇది చిట్ట చివరి బడ్జెట్ అని, ఇక బడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం ప్రజలు ఇవ్వరు అని అన్నారు. ఈ బడ్జెట్ తో బలహీన వర్గాలకు ఏమి ఒరిగిందని ప్రశ్నించారు.

స్మశాన స్థలాన్ని కబ్జా చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల కేంద్రంలో సాదుచెట్టి కులానికి సంబంధించిన స్మశాన స్థలాన్ని కబ్జా చేసిన ప్రభుత్వ అధికారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వినోద్ కుమార్, జిల్లా రైతు సంఘం నాయకుడు గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు గురువారం సాదు చెట్టి కులస్తులతో కలిసి, స్మశాన వాటిక స్థలాన్ని, ఆవుల జాడ స్థలాన్ని కబ్జా చేసిన అధికారిపై, ఈఓఆర్డి సుహాసనమ్మకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ ప్రభుత్వ అధికారి అయి ఉండి ప్రజలను రక్షించాల్సిన ఇతనే, ప్రజలను దోచుకునే విధంగా స్మశాన స్థలాన్ని, కబ్జా చేయడం సమంజసం కాదన్నారు. అంతేకాక ఆవులు జాడకు సంబంధించిన స్థలం కూడా ఆ లే-అవుట్లతో కుంచించుకుపోయి. 40,50, అడుగులు ఉండవలసిన రహదారి, ప్రస్తుతం 5,6 అడుగులకు మించలేకపోయింది. ఇది ఇలాగే వదిలేస్తే, ఆవుల జాడ ఎక్కడ అంటూ దీపం పెట్టి వెతుక్కోవలసిన పరిస్థితి వస్తుంది. కావున సాదు చెట్టి కులస్తుల స్మశాన స్థలము, ఆవుల జాడ స్థలమను కబ్జా చేసిన వారి తో విచారించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని (సిపిఐ) భారత్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బాలచంద్ర, నాగిరెడ్డి, శివ, మురళి, నాగరాజు, పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర - అగళి : గత వారం క్రితం సువర్ణముఖి వంకలో ఈతకు వెళ్లి మృతి చెందిన లోకేష్ కుటుంబానికి మధూడి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. మృతి చెందిన లోకేష్ కుటుంబంలో తండ్రి కూడా కరోనా సమయం లో మరణించడం లోకేష్ కూడా మృత్యువాత పడడం తో ఆ కుటుంబం దిక్కు తోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడు తుండడంతో మదూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అందరు తమ వంతుగా 41,500 రూపాయలను విద్యార్థి తల్లికి ఇచ్చి అండగా నిలిచారు.

పంట నమోదు జాబితా ప్రదర్శన

విశాలాంధ్ర-నల్లచెరువు రూరల్: మండల వ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రబీ ఈ పంట నమోదు పూర్తి వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు, ఎటువంటి పొరపాట్లు చోటు చేసుకున్న 17వ తేదీలోపు అగ్రికల్చర్ అసిస్టెంట్ లకు ఫిర్యాదు చెయ్యాలని మండల వ్యవసాయధికారిని భారతి తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఆల్లుగుండు రైతుభరోసా కేంద్రంలో గ్రామసభ నిర్వహించి జాబితాను చదివివినిపించారు. కార్యక్రమంలో విఏఏ నవీన్ కుమార్, పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 32 మంది గైర్హాజరు

విశాలాంధ్ర-కొత్తచెరువు: సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల శివ సాయి డిగ్రీ కళాశాలలో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సర తెలుగు హిందీ సాంస్క్రిట్ గురువారం జరిగిన పరీక్షల్లో 32 మంది గైర్హాజరు అయినట్టు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 385 మందికి గాను 365 మంది విద్యార్థులు హాజరయ్యారు. శివ సాయి కళాశాలలో 381 మంది గాను 369 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బడ్జెట్ పూర్తిగా అంకెల గారడి

సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-పుట్టపర్తి: వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా అంకెల గారిడినేనని సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ విమర్శించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అప్పుల గణం అభివృద్ధి శూన్యంగా ఉందన్నారు. ఐదు సంవత్సరాలుగా అబద్దాల బడ్జెట్ను ప్రవేశ పెడుతున్నారు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఇంత భారీ బడ్జెట్ ఉన్నప్పుడు ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీ జీతాలు ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. నీటి వనరుల అభివృద్ధికి కేవలం 5% నిధులు మాత్రమే కేటాయించారన్నారు. గత నాలుగేళ్లలో పోలవరం సహా ఏ ఒక్క ప్రాజెక్ట్ అయిన కేవలం ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు అన్నారు. వ్యవసాయ పారిశ్రామిక రంగాలు కుదేలయ్యాయి అన్నారు. నీటిపారుదల రంగానికి కేవలం కనీసం 10% బడ్జెట్ కేటాయింపులు చేయకుండా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి కావన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఆరు లక్షల 81 వేల ఉద్యోగాలు కల్పించినట్లు ప్రకటించడం అతి పెద్ద అబద్ధం అన్నారు. వాలంటీర్లు తప్ప రాష్ట్రంలో ఒక ఉద్యోగం అయిన ఇచ్చారని ప్రశ్నించారు. అప్పుల కోసం 14% వరకు జీడీపీ పెరిగినట్లు చూపించుకుని ఎన్నాళ్లు మోసం చేస్తారన్నారు. 55 వేల కోట్ల రూపాయలు నిధులను డిబిటి ద్వారా బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారులకే డబ్బులు ఇస్తున్నామని పదేపదే చెప్తున్నారే గాని అసలు అందులో కేంద్రం నుంచి వచ్చిన నిధులు శాతాన్ని చూపించే నైతికత ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. ఇప్పటికే అమ్మ ఒడి ఆసరా కళ్యాణమస్తులను ఒక ఏడాదిత్తేశారని కళ్యాణమస్తు లాంటి పథకాలు సరుతల పుణ్యమా అని ఎవరికి వర్తించడం లేదన్నారు. సగానికి సగం స్కీములు స్కీములు గానే ఉన్నాయి అన్నారు. రాష్ట్రంలో 54 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లు పదేపదే చెప్పుకోవడం కన్నా ఆ కార్పొరేషన్లకు కనీసం నిధులు లెక్కల్లో కాకుండా వాస్తవంగా ఇవ్వలేదన్నారు. బడ్జెట్ బారెడు ఖర్చు మూరెడు బడ్జెట్గా ఉందన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా అధోగా తిప్పలు చేసిన జగన్మోహన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదన్నారు

వ్యక్తి మృతి

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండలం పోడరాళ్లపల్లి గ్రామంలో జనసేన పార్టీ కార్యకర్త కస్తూరి శివకుమార్ రాయల్ (32) నిన్న అర్ధరాత్రి ప్రమాద వశాత్తు మిద్దిపై నుంచి పడి మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి గురువారం శివ కుమార్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి జనసేన పార్టీ తరపున10 వేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేయడం జరిగింది.

పన్నులు సకాలంలో చెల్లించండి

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పురపాల క సంఘమునకు చెల్లించాల్సిన అన్ని రకాల పనులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరం ఈనెల ఆఖరితో ముగుస్తున్నందున ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ స్థలం పనులు, ట్రేడ్ లైసెన్సులు, అడ్వర్టైజ్మెంట్ పన్నులను తాము కేటాయించిన కేంద్రాలలో డబ్బులు చెల్లించి, రసీదును పొందాలని వారు తెలిపారు. మార్చి 31 తేదీ లోపల పన్నులు చెల్లించాలని, అట్లు చెల్లించని యెడల సంవత్సరానికి 24 శాతం అపరాధ రుసుము చెల్లించవలసి ఉంటుందని వారు తెలియజేశారు. అదేవిధంగా ఎక్కువ మొత్తంలో బకాయిలు ఉన్నవారి కొళాయి కనెక్షన్లు తొలగించి, చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. పురపాలక సంఘము యొక్క పన్నులను ఆన్లైన్ నందు గాని, మున్సిపల్ కార్యాలయంలో, పార్థసారథి నగర్-2 సచివాలయం, ఎల్సీ సర్కిల్ నందుగల సచివాలయం, గీతా నగర్ సచివాలయము నందు చెల్లించవచ్చునని వారు తెలిపారు

రోగులకు బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం రోగులకు బ్రెడ్ పాలు బిస్కెట్లను సత్య సాయి భజన మండలి నిర్వాహకులు పంపిణీ చేయడం జరిగిందని వారు తెలిపారు. కొత్తపేట కు చెందిన శివయ్య ఆచారి దాతగా వ్యవహరించడం పట్ల వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి లోని రోగులకు, వారి సహాయకులకు, అల్పాహారం, ఉపహారం ను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ పంపిణీ కార్యక్రమానికి దాతలుగా ఎంతోమంది ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియగా నిర్వహించడం జరుగుతుందని, ప్రతి గురువారం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని దాతలు కూడా సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ పద్మలత సత్యసాయి భజన మండలి వారికి దాతలకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-బత్తలపల్లి: ముందర వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక వస్తున్నా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన బత్తలపల్లిలో చోటుచేసుకుంది. బాధితులు, కథనం మేరకు ధర్మవరం పట్టణానికి చెందిన నబిరసూల్ పని నిమిత్తం బత్తలపల్లి వచ్చి ఇక్కడ నుంచి గంటాపురం వెళుతుండగా మలుపు వద్ద తిరుగుతుండగా వెనక నుంచి మరో ద్విచక్ర వాహనము వేగంగా వచ్చి ఢీకొనడంతో రెండు ద్విచక్ర వాహనాల దారులు కూడా రోడ్డుపై పడడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. అందులో నబిరసూల్ కు తీవ్రం గాయాలు కావడంతో స్థానికులు 108 సమాచారం అందించడంతో వాహనం వచ్చి సిబ్బంది ప్రథమ చికిత్సలు చేసి వెంటనే ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేద్దాం

మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రను పుట్టపర్తి నియోజకవర్గంలో విజయవంతం చేద్దామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం టిడిపి కార్యాలయంలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ, ఈ అసమర్థ పాలనను ప్రజలకు వివరిస్తూ లోకేష్ 400 రోజులు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర యువగళం పేరుతో చేపట్టారన్నారు. చరిత్రలో ఇంతవరకు 4000 కిలోమీటర్ల పాదయాత్ర ఎవరు చేయలేదన్నారు. ఈనెల 17న పాదయాత్ర సత్యసాయి జిల్లాలో ప్రారంభమవుతుందన్నారు. తనకల్లు, నల్లచెరువు, కదిరి మండలాల మీదుగా పాదయాత్ర 21న పుట్టపర్తి నియోజకవర్గం లో చేరుతుందన్నారు. ఈ పాదయాత్రలో పెద్ద ఎత్తున తెలుగు యువత, నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ 2024 ఎన్నికలకు ఇది నాంది కావడానికి మన సత్తా ఏమిటో నిరూపించాలన్నారు.

నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్ర షెడ్యూల్....కదిరి మండలం నుంచి 21 మధ్యాహ్నం 2:30 గంటలకు నల్లమాడ మండలం పులగం పల్లికి పాదయాత్ర చేరుతుందన్నారు. భోజన విరామం తర్వాత వణుక వారి పల్లి వరకు పాదయాత్ర సాగుతుందన్నారు. ఉగాది పండుగ కారణంగా 21వ తేదీ రాత్రి హైదరాబాదుకు లోకేష్ బయలుదేరి వెళ్తారన్నారు. పండుగ విరామం తర్వాత 25 ఉదయం నుంచి తిరిగి పాదయాత్ర ప్రారంభం అవుతుంది అన్నారు. అక్కడి నుంచి గాజుకుంటపల్లి నుండి ఓడిసికి చేరుకుని అక్కడ బహిరంగ సభ ఉంటుందన్నారు. ఆ రాత్రి రామయ్యపేటలో బస చేస్తారన్నారు. 26న ఉదయం బయలుదేరి మహమ్మదాబాద్ క్రాస్ చేరుకుంటారన్నారు. అక్కడ వడ్డెరలతో సమావేశం అవుతారు అన్నారు. అల్లాపల్లి మీదుగా గోరంట్ల మండలంలోకి ప్రవేశిస్తారు అన్నారు. గోరంట్ల మీదుగా పాలసముద్రం క్రాస్ నుంచి సోమందేపల్లి, పెనుకొండ మీదుగా పాదయాత్ర సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మండల కన్వీనర్ రామాంజనేయులు, కొత్తచెరువు కన్వీనర్లు రామకృష్ణ, శ్రీనివాసులు, బుక్కపట్నం కన్వీనర్ మల్ రెడ్డి, నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, శ్రీరామ్ రెడ్డి, మహమ్మద్ రఫీ, సామకోటి ఆదినారాయణ, అంబులెన్స్ రమేష్, పుల్లప్ప, సయ్యద్ భాష, దారవనేని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల మృతికి నివాళి

విశాలాంధ్ర - అగళి : మండలపరిధిలోని ఇరిగేపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ మల్లేష్ తండ్రి హనుమంతప్ప అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి మృతదేహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ ఉమేష్, మాజీ ఎంపీపీలు నరసింహప్ప, బసవరాజు, ఇరిగేవల్లి సర్పంచ్ లింగరాజు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు తిప్పేస్వామి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, ప్రధాన కార్యదర్శి జయన్న, మాజీ సర్పంచ్ నింగప్ప, హనుమంతారాయప్ప తదితరులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వెంట వెళ్ళి ఇరిగేవల్లి హనుమంతప్ప భౌతికాయనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పెనుకొండ: మండల పరిధిలోని అమ్మవారుపల్లి గ్రామము లో బుధవారం రాత్రి గుండె పోటుతో మరణించిన వడ్డే చలపతి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాసులు, పెనుకొండ టౌన్ కౌన్సిలర్ బాబు , చాందానాయక్ ,పొగాకురామచంద్ర తదితరులు నివాళులర్పించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆమెతో పాటుగా వాసుదేవరెడ్డి, సూర్యనారాయణ, త్రివేంద్ర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

33వరోజు అన్నా క్యాంటీన్

విశాలాంధ్ర-పెనుకొండ: స్థానిక యోజకవర్గ కేంద్రంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న సవితమ్మ కార్యాలయంలో రూ.5కు 33 వరోజు టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి సవితమ్మ ఏర్పాటు చేశారు. ఆమెతో పాటుగా గుట్టురు మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, అడదాకులపల్లి మాజీ సర్పంచ్ ప్రసాద్, త్రివేంద్ర నాయుడు, బాబుల్ రెడ్డి, మారుతి ,వాసుదేవరెడ్డి, దాదు, సానిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ముదిగుబ్బ మండల పరిధిలోని గాండ్లవరివల్లి గ్రామంలో ధర్మవరం ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి గ్రామంలో ఇంటింటికి వెళ్ళి జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, అందరికీ అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. గాండ్ల వారి పల్లి సర్పంచ్ పి.సూర్యనారాయణ, ప్రభాకర్, వేమనారయన,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సర్పంచులు, పాల్గొన్నారు.

దొంగలతో జాగ్రత్త

విశాలాంధ్ర - అగళి : గత రెండు రోజుల క్రితం మడకశిర పట్టణంలోని మారుతి నగర్ లో అర్ధరాత్రి చెడ్డి గ్యాంగ్ హల్ చల్ చేస్తూ తాళాలు వేసిన ఇళ్ళు ఒంటరిగ ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి ఐదు ఇళ్ళల్లో దొంగలు చోరికి పాల్పడారని ఎస్ ఐ లావణ్య తెలిపారు. కావున మండలప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ ఐ తెలియజేస్తున్నారు. మండల ప్రజలు ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లే సమయంలో ఇంటి వద్ద ఎవరో ఒకరిని పెట్టి వెళ్ళాలని, లేనిపక్షంలో పోలీసులకు సమాచారం ఇస్తే ఆ ప్రాంతం లో రాత్రిపూట వారి ఇండ్ల పైన నిఘా ఉంచడం జరుగు తుందన్నారు. ముఖ్యంగా ఆర్య వైశ్యుల కాలనీవాసులు మరింత జాగ్రత్తగా వుండాలన్నారు. ప్రస్తుతం ఎండాకాలం కావడం తో ఇంట్లో నిద్రించడానికి చెమట పడుతుందని మిద్దెల పైన పడుకునేటప్పుడు ఇండ్లలో ఎవరో ఒకరు తప్పనిసరిగా ఇంట్లో నిద్రించాలన్నారు. అదేవిదంగా మీ పరిసర ప్రాంతాల్లో అనుమాన వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్న తెలుస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే 100 కాల్ కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ ఐ లావణ్య సూచించారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కొరకు ప్రాణాలు అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని, వారి ఆశయ సాధనాల కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రధాన పౌర శాఖ గ్రంథాలయం అధికారిని అంజలి సౌభాగ్యవతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల పౌర శాఖ గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను పాఠకుల నడుమ ఘనంగా నిర్వహించుకున్నారు. తదుపరి వారి చిత్రపటానికి అంజలి సౌభాగ్యవతి, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గ్రంథాలయ సిబ్బంది శివమ్మ, రమణ నాయక్, గంగాధర్, అధిక సంఖ్యలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరంటౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషి చేస్తామని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కలవల రామ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా స్థానిక వాసవి సర్కిల్ లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా ఆర్యవైశ్య సంఘం, పట్టణ ఆర్యవైశ్య సంఘం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి రేపాకుల సురేష్ బాబు, జాయింట్ సెక్రెటరీ గ్రంథే శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు, పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి భీమిశెట్టి కృష్ణమూర్తి, కోశాధికారి ఓవి ప్రసాద్, వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు పోల మద రూపా రాగిణి, నల్లపేట మంజు సంయుక్త, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు అంబటి అవినాష్, ఆవోపా సత్యసాయి జిల్లా ఇంచార్జ్ అన్నా లక్ష్మీనారాయణ, ఆవోపా పట్టణ అధ్యక్షులు డాక్టర్ శీభా నగేష్ గుప్తా, కలవల కిషోర్, దోరణాల ఫణి రాజ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: శాఖా గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 122వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన గ్రంథాలయ అధికారి కె. జయరాం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానుభావుడన్నారు. ఆంధ్రులకు ప్రాంత ఏర్పాటు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయనే కారణమన్నారు. శ్రీరాములు మహాత్మాగాంధీ సత్యం, అహింస, హరిజనోధారణ పట్ల ఆకర్షితుడై ఆయన అడుగుజాడల్లో నడిచి వ్యక్తిఅన్నారు. ఆయన జీవితాంతం ప్రజా సేవకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు వెంకటరమణప్ప, కిష్టప్ప, రహంతుల్లా, మహమ్మద్, రామచారి, వెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: స్థానిక గ్రంథాలయమును జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ ఆకస్మికంగా గురువారం తనిఖీ నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే స్వతంత్ర సమరయోధుడు, మద్రాసు రాష్ట్రం నుంచి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం నిజమైన ఆమరణ నిరాహార దీక్ష 56 రోజులపాటు చేసి ప్రాణ త్యాగం చేసిన అమరజీవి, పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వీరికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమ, పెనుకొండ గ్రంథాలయ అధికారి మహబూబ్ భాషా, గ్రంథాలయ పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: డెంగ్యూ వ్యాధిపై ప్రజలందరూ కూడా అప్రమత్తంగా ఉంటూ సరియైన సమయంలో వైద్య చికిత్సలను పొందాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జయరాం నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం-పోతుకుంట సచివాలయ పరిధిలోని బీసీ కాలనీలో డెంగ్యూ వ్యాధి లక్షణాలు గల ఇళ్లను గురువారం సందర్శించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఉన్న వాళ్లందరి రక్త నమూనాలను సేకరించారు. తదుపరి దాదాపు 80 ఇళ్లల్లో షఫీనోత్రిన్ పిచికారి చేయడం జరిగింది. అనంతరం ఆంటీ లార్వా ఆపరేషన్ కూడా చేయడం జరిగిందని తెలిపారు. అక్కడున్న ప్రజలందరికీ డెంగ్యూ వ్యాధి చికెన్ గునియా మలేరియా తదితర వ్యాధులపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. రాత్రిపూట దోమతెరలు వాడాలని సాయంకాలం సమయంలో వేపాకు పొగ వేసుకోవాలని, ఇంటి చుట్టుపక్కల, పరిసర ప్రాంతాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం. శ్యామల, ఎమ్మెల్హెచ్ పి గౌతమి, హెల్త్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.